క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరు సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. కందుకూరు పంచాయతీ నిలువురాతిపల్లికి చెందిన రామచంద్ర (58) తన మనవడు బృంధన్ (15)తో కలసి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా ప్రమాదవశాత్తు ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. ఘటనలో రామచంద్ర తలకు బలమైన గాయం కావడంతో పీటీఎం పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించి అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్ణాటక రాష్ట్రం చింతామణికి వెళ్లారు. బృంధన్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు.

నవోదయకు అభిరామ్ ఎంపిక




కలకడ : మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ కలకడ మాదిగపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థి అభిరామ్ నవోదయ గురుకుల పాఠశాలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌నాయుడు తెలిపారు. ఆదివారం నవోదయ గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతూ నవోదయ పరీక్షలకు స్థానిక పాఠశాల ఉపాధ్యాయునిచే ప్రత్యేక శిక్షణ తీసుకొని నవోదయకు అభిరామ్ ఎంపికయ్యాడు. శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు భాస్కర్‌నాయుడుకు విద్యార్థి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ

మదనపల్లె సిటీ: జవహర్ నవోదయలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో స్థానిక విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 2024–25 సంవత్సరానికి సి.చేతన్, బి.అఖిలేష్, ఎం.ఉమేష్ అర్హత సాధించారు. అలాగే ఆరుగురు విద్యార్థులు సైనిక్ స్కూల్‌కు ఎంపికయ్యారు.

శివుడిపై సూర్యకిరణాలు



లక్ష్మీకామేశ్వర స్వామిపై సూర్యకిరణాలు పడుతున్న దృశ్యం

వాల్మీకిపురం: స్థానిక కోనేటివీధిలోని శ్రీ లక్ష్మీ కామేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ఉదయం బ్రహ్మసూత్రము కలిగిన శ్రీ కామేశ్వర స్వామి పాదాలను సూర్యకిరణాలను తాకింది. అనంతరం స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. స్వామివారిపై సూర్యకిరణాలు పడడంతో భక్తులు విశేషంగా తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో అర్చకులు గోనవరపు శీనా స్వామి, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఉట్ల తిరునాల



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మదనపల్లె సిటీ: స్థానిక చిత్తూరురోడ్డులోని కనుమలో గంగమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం పగలు తిరునాల ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించారు. ఆలయం ఎదుట దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం ఎదుట ఉట్లమానును యువకులు ఎంతో ఉత్సాహంగా పోటీ పడుతూ ఎక్కారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్యశిబిరం

కేవీపల్లె : పీలేరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రేవూరి సుధీర్ సౌజన్యంతో మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ దేవాండ్లపల్లెలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. డాక్టర్ మునిచంద్రారెడ్డి సుమారు 70 ఆవులకు, 40 గొర్రెలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు, మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షులు సురేంద్రనాథరెడ్డి, కార్యదర్శి సుబ్రమణ్యం, ట్రెజరర్ జయచంద్రనాయుడు, డాక్టర్ ప్రసాద్, సుధాకర్‌రెడ్డి, మహేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కరుణామయుడు ఏసు ప్రభువు



ఈస్టర్ సందేశాన్ని వినిపిస్తున్న డివిజన్ సంఘు కాపరి సునిల్‌వరకుమార్



: అంగళ్లు చర్చిలో ప్రసంగిస్తున్న పాస్టర్ ప్రకాశం

- భక్తిశ్రద్ధలతో ఈస్టర్
- ఆకట్టుకున్న భక్తిగీతాలు

మదనపల్లె సిటీ: కరుణామయుడు ఏసుక్రీస్తు అని డివిజన్ సంఘు కాపరి రెవ.డాక్టర్ సునిల్‌వరకుమార్ ఉద్బోదించారు. స్థానిక జెసీఎం చర్చిలో ఆదివారం ఈస్టర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈస్టర్ పురస్కరించుకుని చర్చిని మల్లె పూలతో అందంగా అలంకరించారు. ఉదయం 6 నుంచి 9 గంటల వరకు ఈస్టర్ ఆరాధనలో భక్తులు పాల్గొన్నారు. సునిల్‌వరకుమార్ మాట్లాడుతూ ప్రేమ, సహనం, శాంతి కుసుమాలను పూయించిన కృపామయుడు ఏసు అని తెలిపారు. శిలువ వేసిన మూడో రోజు ఏసుక్రీస్తు తిరిగి లేచిన దినాన్ని ఈస్టర్ పండుగా జరుపుకోవడం అనవాయితీగా వస్తోందన్నారు. ప్రజలు చెడు మార్గాన్ని వదిలి సంతోషం, సమాధానం, శాంతం, దయ, మంచితనం, విశ్వసనీయత, సాత్వి గుణం, నిగ్రహం తదితర లక్షణాలు కలిగి అధ్యాత్మికంగా ఐక్యత పెంచుకుని జీవించాలని సూచించారు. డేవిడ్ సంజయ్ కొరియర్ బృందం భక్తిగీతాలు ఆలపించారు. కార్యక్రమంలో జెసిఎం చర్చి కార్యదర్శి భక్తవత్సలం, కోశాధికారి ఆనంద్, సభ్యులు పాల్గొన్నారు. దీంతో పాటు ఆరోగ్యవరంలోని ఏంఎంసీ, గుడిసివారిపల్లె సెయింట్‌లూక్ చర్చి, ఆరోగ్యమాత చర్చి, ఈస్టుపేట, బుగ్గకాల్వల్లోని చర్చిల్లో ఈస్టర్ వేడుకలు నిర్వహించారు.

ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న నిస్సార్ అహ్మద్: ఈస్టర్ వేడుకల్లో మదనపల్లె నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిస్సార్‌అహ్మద్ పాల్గొన్నారు. డివిజన్ సంఘు కాపరి నుంచి ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జింకా చలపతి, కౌన్సిలర్ పాల్ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు శశాంక్‌రెడ్డి, పాల్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

లోకానికే మహోదయం క్రీస్తు పునరుత్థానం

కురబలకోట: యేసు పునరుత్థానం లోకానికి మహోదయమని మదనపల్లె హెబ్రోన్ ప్రార్థన మందిరం సహాయ పాస్టర్ బి. ప్రకాశం కొనియాడారు. ఈస్టర్ సందర్భంగా అంగళ్లలోని సీయోను ప్రార్థన మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు,ఆరాధన కార్యక్రమాలు నిర్వహించారు. పాటల ద్వారా వాక్యం ద్వారా ఆనందంగా క్రీస్తును స్మరించకున్నారు. పునరుత్థానాన్ని కొనియాడారు. ముఖ్య అతిథిగా ఆయన వాక్యోపదేశం చేస్తూ పునరుత్థానమంటే తిరిగి లేవడమని అర్థమన్నారు. ఈస్టర్‌గా చెప్పుకునే పునరుత్థానంతో కొత్త జీవితం ప్రారంభించాలన్నారు. చనిపోయి మరణాన్ని గెలిచి తిరిగి మూడవ రోజున క్రీస్తు లేవడం ప్రపంచంలో పెను సంచలనంగా మారిందన్నారు. క్రీస్తు జీవితం విలక్షణమైనదన్నారు. ఆపై ప్రత్యేకమైనదన్నారు. ఆయన జీవిత ప్రస్థానం ప్రపంచ చరిత్రలో పెను మార్పులకు దారితీసిందన్నారు. ప్రేమ, దయ, కరుణ, పశ్చాత్తాపం, క్షమ, మారుమనస్సు, సమాధానం లాంటి ఆత్మీయ పదాలకు మనిషిలో, సమాజంలో చోటు లభించిందన్నారు. క్రైస్తవ ప్రపంచంలో నూతన అధ్యాయానికి కారకులయ్యారన్నారు. ఆయన పామరులు, గొర్రెల కాపరులు, జాలరులతో కాలం గడిపాడన్నారు. మానవుల పాపాంధకారాన్ని తొలగించడానికి జీవపు వెలుగును ప్రసాదించారన్నారు. నిస్సహాయులు, నిరాశ, సాధక బాధలలో ఉన్న వారితో పాటు విరిగి నలిగిన హృదయాలకు క్రీస్తు ఆశాకిరణంగా మారారన్నారు. శామ్యూయేల్, జాన్, నాతానురెడ్డి,జయరాజ్ రెడ్డి, భాస్కర్, నెహెమ్యా, టైటస్, నక్కా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్



కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మదనపల్లె: మదనపల్లె పట్టణంలో ఆదివారం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు టు టౌన్ సీఐ యువరాజ్ ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. కేంద్ర సాయుధ బలగాలైన ఎస్ఎస్‌బి కమాండోలతో పట్టణంలోని ప్యారానగర్, మెట్రోకాంప్లెక్స్, మార్వురివీధి, ఇందిరానగర్, కృష్ణనగర్, జ్యుడీయల్‌కాలనీ, ప్రశాంత్‌నగర్, మాయబజార్ మీదుగా టిప్పు సుల్తాన్‌మైదానం వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలకు భరోసా కలిస్తూ నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లఘించినా, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని సీఐ యువరాజ్ హెచ్చరించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహరించాలని కోరారు.

ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమే బాబు నైజం

- పేదలకు మేలు చేసే వ్యవస్థను నిలుపుదల చేయిస్తారా ?
- వలంటీర్ల వ్యవస్థపై ఈసీ నిర్ణయాన్ని పునఃసమీక్షించాలి
- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్



మాట్లాడుతున్న నిసార్‌అహ్మద్

మదనపల్లె : పేదలు సంతోషంగా ఉన్నా, వారికి సమయానికి సంక్షేమ పథకాలు అందుతున్నా.. చూసి ఓర్వలేని తనం చంద్రబాబుదని, ప్రజలను ఇబ్బంది పెట్టడమే ఆయన నైజమని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ అన్నారు. వలంటీర్లు పెన్షన్ పంపిణీ చేయకుండా ఎన్నికల కమిషన్ తీసుకున్న నిర్ణయంపై ఆదివారం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతినెలా ఠంచనుగా ఒకటోతేదీ ఉదయానికల్లా వలంటీర్లు..అవ్వా, తాతలను, దివ్యాంగులను, వితంతు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, చేనేత, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, ఒంటరి మహిళలు,.... ఇలా అన్ని వర్గాలకు చెందిన పెన్షన్ లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి ప్రభుత్వం అందించిన మొత్తాన్ని అందజేసేవారు. గతంలో పెన్షన్ పుస్తకాలు చేతిలో పట్టుకుని, వారంరోజులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తే తప్ప పెన్షన్ అందేది కాదు. అవ్వాతాతలు ఎన్నో ఇబ్బందులు పడేవారు. వారందరి కష్టాలను తీర్చేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చి, వారితో నిస్వార్థంగా సేవలందిస్తుంటే..దాన్ని నీచరాజకీయాలకు ముడిపెట్టి నిలుపుదల చేయించడం దారుణమన్నారు. తొలినుంచీ ప్రతిపక్షనాయకులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లకు వలంటీర్ల వ్యవస్థ అంటే గిట్టదని, పలుమార్లు నేరుగా వారిని విమర్శించేలా పరుషమైన వ్యాఖ్యలు చేశారన్నారు. నిన్నటికి నిన్న శ్రీ కాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జలసుధీర్‌రెడ్డి వలంటీర్లను టెర్రరిస్టులుగా, స్లీపర్‌సెల్స్, జిహాదీలుగా పేర్కొంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. వీటన్నంటినీ గమనిస్తుంటే.. పేదలకు సంక్షేమ పథకాలు అందడం టీడీపీకి ఇష్టం లేదని అర్థమవుతోందన్నారు. తమకు అనుకూలుడైన నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌తో ఫిర్యాదు చేయించి, వలంటీర్ల సేవలను ప్రజలకు దూరం చేశారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో చంద్రబాబుకు రాజకీయ కక్షలు ఉంటే...ప్రజాక్షేత్రంలో తేల్చుకోవాలే తప్ప, వృద్ధులు, అభాగ్యుల నోరు కొట్టేలా వ్యవహరించడం తగదన్నారు. వృద్ధులు, పెన్షన్ లబ్ధిదారుల ఉసురు బాబుకు కచ్చితంగా తగులుతుందని,పెన్షన్ పంపిణీ అంశంపై ఎన్నికల కమిషన్ పునరాలోచించాలని కోరారు.

నల్లారి సోదరులకు గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి

పీలేరు : సార్వత్రిక ఎన్నికలతో నల్లారి సోదరులకు ఓటు ద్వారా గుణపాఠం చెప్పాలని పీలేరు, కేవీపల్లె మండలాల వైఎస్సార్‌సీపీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తమపై అసభ్య పదజాలం వాడుతూ వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. నల్లారి సోదరులు హైదరాబాద్‌లో ఉంటూ ఎన్నికల సమయంలో వలస పక్షుల లాగా ఇక్కడికొచ్చి రాజకీయపబ్బం గడుపుకుని తిరిగి వెళ్లడం పరిపాటిగా మారిందన్నారు. వారికి రాజకీయ సమాధి తప్పదన్నారు. తాము పీలేరులో ఎన్నికల ప్రచారం చేస్తోంది కేవలం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవడానికేనని స్పష్టం చేశారు. నల్లారి సోదరుల ఓటమిని ప్రజలు ఎప్పుడో నిర్ణయించారని తెలిపారు. తాము ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి ప్రజలకు చెప్పి ఓట్లు అడుగుతున్నామని, మీరు ప్రజలకు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యేగా పోటీ చేసే వ్యక్తి ఇకనైనా హుందాగా వ్యవహరించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, జ్ఞానశేఖర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, రమేష్‌రెడ్డి, ఉమాకాంత్‌రెడ్డి, ద్వారకనాథరెడ్డి, వినీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వాల్మీకిపురం: ఏప్రిల్ 2వ తేదిన మదనపల్లిలో జరిగే మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ మదనపల్లిలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిర్వహిస్తున్న సిద్ధం సభకు పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధ్యాయ వృత్తి అందరికీ ఆదర్శం



గంగాద్రినాయుడు దంపతులను సన్మానిస్తున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : ఉపాధ్యాయ వృత్తి సంఘంలోని అందరికీ ఆదర్శం అని ఎంపీపీ శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు, మానవతసంస్థ వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం కలకడ బాటవారిపల్లె ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గంగాద్రినాయుడు పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యాభివృద్ధి కోసం గంగాద్రినాయుడు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా షష్టి పూజలు

నందలూరు(రాజంపేట): నందలూరు రైల్వేకేంద్రంలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో షష్టి సందర్భంగా ఆదివారం శ్రీ సుబ్రమణ్యస్వామికి ఘనంగా సామూహిక అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలు, తీర్థప్రసాద కార్యక్రమాలు జరిగాయి. ఆలయ అర్చకులు రవిస్వామి ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త రమణారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ఇంటింటా సంక్షేమం



కలికిరివాండ్లపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కలికిరి: వైఎస్సార్‌సీపీతోనే ఇంటింటా సంక్షేమ సాధ్యమవుతుందని ఆ పార్టీ నాయకులు పేర్కొన్నారు. కలికిరి గ్రామ పంచాయతీ పరిధిలోని కలికిరివారిపల్లి, కదిరాయకుంట, చక్కెవాండ్లపల్లి, రాజవారిపల్లి గ్రామాల్లో ఇంటింటా వైఎస్సార్‌సీపీ ఎన్నికల కరపత్రం అందజేసి వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి లకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఎమ్మెల్యే, ఎంపీ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సేవకే అంకితమయ్యారని, ప్రజల సౌకర్యార్థం గ్రామాల్లో నీటిశుద్ధి యంత్రాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వం నుంచి ప్రతి ఇంటికి లబ్ధి చేకూరిందని, ఇలాగే సంక్షేమం కొనసాగాలంటే తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రావాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు భోగేష్, జేసీఎస్ రెడ్డెప్ప, యువజన విభాగం జిల్లా కార్యదర్శి అజయ్, శివారెడ్డి, కేఎంఆర్, షౌకత్, మారయ్య, షాకీర్, సుధా, షాహీర్, పెద్ద ఎత్తున యువత తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి



ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న చింతల సాయికృష్ణారెడ్డి

గుర్రంకొండ: జగనన్నను మరోసారి ఆశీర్వదించి ముఖ్యమంత్రిని చేయాలని చింతల సాయికృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మర్రిపాడు పంచాయతీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసి పేదల గుండెల్లో చిరస్థాయిగా జగనన్న నిలిచిపోయారన్నారు. పార్టీలకు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. ముఖ్యంగా మహిళల కొసం ఎన్నో పథకాలు ఇచ్చారన్నారు. మహిళలు ఆర్థికస్వావలంబన సాధించడమే జగనన్న ధ్యేయమన్నారు. రానున్న ఎన్నికల్లో రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు అప్పల్ల, సర్పంచ్ నందినీ, ఎంపీటీసీ యాకూబ్, మాజీ సర్పంచ్‌లు రాజశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సేవలు ఆదర్శనీయం



పదవీ విరమణ పొందిన కార్మికులను సన్మానిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : పదవీ విరమణ పొందిన ఆర్టీసీ ఉద్యోగుల సేవలు ఆదర్శనీయమని డీఎం కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక డిపో ఆవరణలో పదవీ విరమణ పొందిన కండెక్టర్లు డి. సైదుల్లా, ఎస్.నజీర్, రాజేంద్ర, డ్రైవర్ ఎస్. వాసు, మెకానిక్ ఎస్‌వి.రమణలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన ఉద్యోగులు పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. వీరి శేషజీవితం సుఖమయంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఐ సుబ్బమ్మ, గ్యారేజీ ఎంఎఫ్ హరినాథరెడ్డి, బస్టేషన్ మేనేజర్ రెడ్డెప్ప, వివిధ యూనియన్ల నాయకులు రాజు, సి.వి. రమణ, ఆదిరెడ్డెప్ప, రాజునాయక్, హరి పాల్గొన్నారు.

శాలివాహనుల అభివృద్ధికి కృషి



రెడ్డెప్పకు నియామక పత్రాన్ని అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్

వాల్మీకిపురం: శాలివాహనుల అభివృద్ధి, హక్కుల పరిరక్షణకు అందురూ కలిసి పని చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పొన్నా రవికుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక కుమ్మరవీధిలో శాలివాహన సంఘం సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గురు స్వామితో కలసి రవికుమార్ మాట్లాడారు. చేతి వృత్తులపై పాలన చేస్తున్న ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని, పాలకుల నిర్లక్ష్యంతో మనం ఎంతగానో నష్టపోయామన్నారు. శాలివాహన అభివృద్ధి సంక్షేమ సమితీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అన్నమయ్య జిల్లా కలకడ మండలంకు చెందిన పట్టేటి రెడ్డెప్పను నియమించినట్లు పొన్నా రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పులివెందుల వెంకటేష్, నరసయ్య, లక్ష్మయ్య, చంద్రబాబు, సోమశేఖర్, గోవిందరాజు, అర్జునయ్య, వెంకటయ్య, వేణు పాల్గొన్నారు.

జాతరలు సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక

కురబలకోట: మండంలోని ముదివేడు దండుమారెమ్మ జాతర సందర్భంగా తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జాతరలు, ఉత్సవాలు సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నాయన్నారు. ప్రజల జీవన విధానానికి, విశ్వాసాలకు, ధార్మిక జీవనానికి కూడా అద్దం పడతాయన్నారు. ఎం.ఫిరోజ్‌ఖాన్, క్రాస్ నారాయణ రెడ్డి, ఆర్సీ ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోండి

కేవీపల్లె : జాతీయ ఉపాధి హామీ పథకం పనులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో నాగరాజ అన్నారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఉపాధిలో దినసరి కూలీ ఇది వరకు రూ. 272 ఉండేదన్నారు, ఏప్రిల్ 1 నుంచి రూ. 300కు పెంచినట్లు తెలిపారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి 100 రోజుల పని కల్పించనున్నట్లు చెప్పారు. పని చేసే కూలీలు క్షేత్ర సహాయకుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఉపాధి పనులనుస ద్వినియోగం చేసుకోవాలన్నారు.

కరుణించమ్మా..రెడ్డెమ్మ తల్లీ



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: కరుణించమ్మా అంటూ భక్తులు మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లిను మొక్కుకొన్నారు. ఆదివారం అమ్మవారి ఆలయం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వేకువజాము నుంచే భక్తులు చేరుకొన్నారు. మహిళలు అమ్మవారి కోనేట్లో స్నానమాచరించి అమ్మవారి ఎదుట సంతాన కోసం వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు.

బస్సు యాత్ర విజయవంతం చేయండి



ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి

ములకలచెరువు: తంబళ్లపల్లి నియోజకవర్గంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటించే బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మండలంలోని పెద్దపాళ్యంలో మండలంలోని ప్రజా ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మదనపల్లిలో నిర్వహించే మేమంతా సిద్ధం సభకు సీఎం హాజరు కానున్న నేపథ్యంలో ములకలచెరువులో సోమవారం రాత్రి బస చేస్తారన్నారు. అనంతరం మంగళవారం ఉదయం మండలంలోని పెద్దపాళ్యం, వేపూరికోట, బురకాయలకోట మీదుగా పర్యటించే బస్సు యాత్రకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సిద్ధం సభను జయప్రదం చేయండి

పీలేరు : మదనపల్లెలో రేపు జరుగనున్న మేమంతా సిద్ధం సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బస్సుయాత్ర మంగళవారం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. మేమంతా సిద్ధం సభకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

సభను విజయవంతం చేయాలి

రామసముద్రం: మదనపల్లె టిప్పు సుల్తాన్ మైదానంలో 2వ తేదీన జరిగే మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దేశాయి తిప్పారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన రామసముద్రంలో కార్యకర్తలతో సంసిద్ధత కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మనమంతా సిద్ధం సభను విజయవంతం చేసేందుకు అధిక సంఖ్యలో కార్యకర్తలు , అభిమానులు తరలిరావాలని కోరారు. ఎంపీపీ కుసుకుమారి, జెడ్పీటీసీ రామచంద్రారెడ్డి , కన్వీనర్ నంద, కృష్ణారెడ్డి, కేశవరెడ్డి, రమణారెడ్డి, దొడ్డిపల్లి ఆనంద, ప్రకాష్, జయరామిరెడ్డి పాల్గొన్నారు.